


# ఆశయాలు_ఆవేశాలు

(గత సంచిక తరువాయి)

గాలివాన వచ్చి తగ్గినట్టయ్యింది అక్కడి వాతావరణం. రెమ్మలు విరిగిన చెట్టులా నిల్చుండిపోయింది పార్వతి. ఆమె కళ్ళు నీళ్ళ పర్యంతమయ్యాయి. గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. మెదడులో రైళ్ళు ఢీకొంటున్నాయి.

కూతురి అవస్థ సుభద్రమ్మకి బాధ కలిగించింది. అలాగని ఆమెను ప్రోత్సాహపర్చలేదు. ఏమీ చెప్పలేని యిరుకులో పడిందామె.

"మీ నాన్న సంగతి నీకు తెలిందేముందే పార్వతీ! ఆయన చెప్పినట్టే నడుచుకోకూడదూ! ఆయన్ని యెదిరిస్తే, అనవసరంగా అభాసుపాలు కావల్సి వస్తుంది. నీ ఆశయాలకోసం నువ్వు ప్రయత్నిస్తే, నువ్వు వుద్యోగంలో చేరితే,ఆయనకేదో అప్రతిష్ట వస్తుందని ఆయన భావిస్తున్నప్పుడు, నీ ఆశయాల్నే దూరంగా పెట్టడం మంచిదేమో! మీ నాన్న దురుసుదనం నీకు తెలీదా, యేవిటి? నేను గాబట్టి యిన్నేళ్ళుగా, యిలా సహిస్తూ వస్తున్నాను. అయినా, నువ్వీ పట్టుదల సాధించాలని యెలా నడుంకట్టావో తెలీకుండ వుందే: మనం యేం సాధించదల్చుకున్నా, పెళ్ళి కాక ముందేనమ్మా! పెళ్ళయ్యాక మనం, సంఘమనే నాలుగు గోడల మధ్య ఖైదీల మన్నమాటే! అడుగడుగు నా ఆటంకాలు వస్తుంటాయి. భర్తే అధికారి చెప్పినట్టంతా చెయ్యాల్సిందే! నిన్ను చూస్తే నిజంగా నాకు జాలేస్తుంది పార్వతీ! అయినా యేం చేస్తాం? మనం ఆడవాళ్ళం.. అస్వతంత్రులం.. అనాదిగా వస్తున్న హిందూ స్త్రీ ధర్మాన్ని మనం కూడా నిర్వర్తించవల్సిందే!"

అంటూ హితబోధ చేసి వెళ్ళిపోయింది సుభద్రమ్మ వంటగది వేపు.

పార్వతి ఒంటరిగా, సాలోచనతో నిలుండిపోయిందక్కడే. జీవిత పోరాటంలో కూడా ప్రస్తుతం ఆమె ఒంటరిదయ్యింది. ఆమె ఆశయాల్ని అర్థం చేసుకుని చేయూత నిచ్చేవాళ్ళు ఒక్కరూ అగుపించ లేదు. అందరిమీదా ఆమెకి కోపం వచ్చింది. భర్తమీద, వేదవతిమీద, తల్లిమీద, తండ్రిమీద, అమితంగా కోపం వచ్చింది. ముఖ్యంగా తండ్రిపై కసి ఏర్పడింది.ఆక్షణములో మగజాతినంతటినీ అసహ్యించుకుంది. 'ఆడవాళ్ళు ముందుకు సాగిపోతున్నామన్నా, మగాళ్ళే కానివ్వకుండా వున్నారు'అని కసిగా విసుక్కుంది. అయినా యేం చేస్తుంది? ఆత్మ సంఘర్షణే మిగిలిందామెలో.

## 5

రాజారావుకు హోటలు మెతుకులు యింకా రుచించడంలేదు. అవుతేమాత్రం యేంచేస్తాడు? పార్వతిని వచ్చేయమని వ్రాయలేడు. వంట చేతకాదు. ఎవరితోనో తన అభిప్రాయం చెప్పకుండా వూరుకున్నాడు. భోజన సదుపాయం బాగా తగ్గిందనే చెప్పాలి. దానికితోడు యింటికొచ్చి టిక్కుటిక్కు మనుకుంటూ ఒంటరిగా కూచోవడం, మరీ బాధనిపిస్తోంది. అక్కడికీ, రాత్రి ఒక్కోప్పుడు చాలా వేళవరకూ, యెక్జిబ్లోనో, సినిమాచూసో, కాలంగడుపుకొస్తున్నాడు. భోజన సదుపాయం లేకపోవడం, సరిగ్గా నిద్రలేకపోవడం, అతని ఆరోగ్యానికి దెబ్బతగిలింది.ఒంప ప్రారంభమై, చివరికి జ్వరంలోకి దించింది.

జ్వరం తగిలిన రో యెక్కడికీ వెళ్ళకుండా యింట్లోనే వుండిపోయాడు రాజారావు. భోజనానికూడా వెళ్ళలేదు. అసలు, భోజనం చేయాలన్న ఆసక్తి కూడా అతనిలో లేదు. కాసింతవేడి కాఫీ తీసుకోవాలనుకున్నాడు. కానిఅదితయారుచేసి యిచ్చేదక్షత కూడాలేదు. పక్కింటివాళ్ళ నడిగితే యిస్తారు. కాని, అడగటం యిష్టం లేదు. అడిగిన వెంటనే తన అనారోగ్యంగురించి పార్వతికి రాస్తారు తప్పదు. తనే కావాలని రాయించాననుకుంటుంది పార్వతి. ఆమెలో మరింత గర్వం పుట్టుకొస్తుంది....యీ విధంగా ఆలోచించి పక్కింటివాళ్ళను అడగలేదు.

# ముద్దం శెట్టి హనుమంతరావు

ఎప్పుడూ సాయంత్రం పూట కలుసుకొనే స్నేహితుడు ఆరోజు రాకపోయేసరికి రాధాకృష్ణ నేరుగా రాజారావుయింటికే వచ్చేశాడు. రాజారావు తలుపు తెరచాడు. శాలువకప్పుకున్న రాజారావుని చూసి విస్తుపోయాడు రాధాకృష్ణ.

"అదేమిట్రా, శాలువ కప్పుకున్నావు?"అన్నాడు

"ఏంలేదులే! చిన్న జ్వరం తగిలిందీ..."అంటూ లోపలికి నడిచాడు.వెళ్ళిమంచంమీదకూర్చున్నాడు రాధాకృష్ణ యెదురుగా కుర్చీవుంటే, అందులో కూలబడ్డాడు.

"అవుతే ఇప్పుడేమన్నా ఫోంచేశావా?"

"లేదురా! కాఫీతెచ్చిపెట్టేవాళ్ళకూడా లేరు. ఒళ్ళంతాపచ్చిపుండులావుంది. ఓఅనాసిన్ టేబ్లెట్ తీసుకోద్దూ! అదిగో ఆ ఫ్లాస్కు తీసుకెళ్ళి కాస్త వేడికాఫీకూడా పట్రా"

"కాఫీపక్కింటివాళ్ళచేత పెట్టించేద్దాం రా!

"వద్దురా! ఎలాగో అనాసిన్ మాత్రకోసం వెళ్తావు....హోటలు దగ్గరేగా!"

"వదినగారిని వచ్చేయమని టెలిగ్రాం యిచ్చేద్దునా? "

రాధాకృష్ణనుండి లదే ప్రశ్న రాజారావు సరిగ్గా అదే ప్రశ్నవేశాడు. రాధాకృష్ణకూడా. "వద్దురా రాధా!" అన్నాడు ముక్తసరిగా.

రాధాకృష్ణ తెల్లబోయాడు.

"అదేవిట్రా! వంట్లో బాగులేక పడున్నావు. ఇంట్లో చూస్తే ఎవరూ లేరు. పార్వతిని రమ్మని టెలిగ్రాం యిస్తానంటే వద్దంటావేం" అన్నాడు.

రాజారావు మెల్లగా నవ్వాడు. ఆ నవ్వుకి అర్థమేమిటో తెలీలేదు రాధాకృష్ణకి.

"నేనిలా అంటున్నానంటే దానికి చాలా కారణాలున్నాయిరా" అన్నాడు రాజారావు.

"కారణాలా?" వింతగా అడిగాడు రాధాకృష్ణ.

"ఔను!" గంభీరంగా అనేసి కాస్సేపు మౌనంగా వూరుకుని తప్పని సరిగా చెప్పాల్సి వచ్చింది గాబట్టి, విషయమంతా చెప్పాడు రాజారావు.

రాధాకృష్ణ అంతా విని ఆశ్చర్యపోయాడు. తనింటి తగువే వాళ్ళిద్దరి మధ్య వైరం తెచ్చిందని అతనికి యింతకుముందు తెలీదు. అసలా విషయం యింత దూరం దారితీస్తుందని అతనెప్పుడూ అనుకోలేదు కూడాను.

"చిన్నవిషయాన్ని ఇలాపెంచుకున్నారేమిట్రా అన్నాడు అదోలా మొహం పెట్టి రాధాకృష్ణ.

"చిన్న విషయం కాదురా! పార్వతికి ఆలోచన తక్కువ. అహంభావం ఎక్కువాను. ఆశయాలు ఆదర్శాలు, హక్కులు అంటూ పెద్ద పెద్ద వుపన్యాసాలివ్వడంలో దిట్ట. ఆమెకి ఓసారి బుద్ధి చెప్పాలనే యిలా చేశాను. ఇప్పుడు రమ్మని టెలిగ్రాం యిస్తామనుకో! "ఆడవాళ్ల అవసరం యిప్పుడైనా తెలిసిందా?' అని ఎదురు ప్రశ్న వేస్తుంది. మహాగర్వంగా. అందుకే నాకిష్టం లేదు. నువ్వున్నావుగా — ఆపాటి అవసరానికి అదుకోపోవు..... యీ రాత్రికి నువ్వు కాఫీ తెచ్చి పడేశావంటే చాలు... మళ్లీ రేపటిమాట చూసుకుందాం......" అంటూ ముగించాడు, రాజారావు.

రాధాకృష్ణకి అర్థమైందంతా స్త్రీ స్వాతంత్ర్యం పట్ల అతనికీ సద్భావం లేదు. అసలు ఆమాటంటేనే అతనికి రోత. అందులోను ఆరోజు పార్వతి మాటలు అతన్ని మరింత ఉద్రిక్తుణ్ణి చేశాయి. ఆమాటలు చెవుల్లో యింకా గింగురు మంటూనే వున్నాయి. ఆమెకేవిధంగా శాస్తి జరగాలి అని ఎంచిదనే అన్పించింది. అయినా తనభావాన్ని వ్యక్తం చెయ్యలేదు బావుండదని.

"సరే నీయిష్టం నేనున్నానుగా! నాసహాయం ఎప్పుడూ వుండనే వుంటుందిలే మరి నేనలా వెళ్ళి కాఫీ పట్టుకొచ్చేస్తా.... అంటూ లేచి బయల్దేరాడు ఫ్లాస్కు పట్టుకొని.

"డబ్బులు తీసుకెళ్లరా అన్నాడు రాజారావు

రాధాకృష్ణకి యివన్నీ చెప్పడంలో తను తొందర పడ్డాడేమో ననుకున్నాడు రాజారావు. వాడికి చెప్పినందువల్ల మునిగిపోయిందేమీ లేదని మళ్ళీ సర్దుకున్నాడు. తనలోతానే. అప్రయత్నంగాపార్వతిగుర్తుకొచ్చింది.బాబుస్మృతిపథంలో మెదిలాడు. పార్వతి వుద్యోగంసంపాదించిందేమో? సంపాదిస్తే రాయకుండా వుంటుందా? ఇంక వుద్యోగం దొరకలేదేమో..... అనుకున్నాడు.

ఇంతలో వీధి తలుపు కిర్రుమంది. రాధాకృష్ణ యింత త్వరలో వచ్చేస్తాడని నమ్మకం లేక పోయింది. ఎవరావచ్చింది? అని ఆలోచించుకునేంతలో—

"ఏమయ్యోయ్ రాజారావ్..." అన్న కేక విన్పించింది. అది పక్కింటి విశ్వనాథంగారి గొంతుకని పసిగట్టేసి మంచంమీదినుండి చెంగున గెంతాడు కిందికి.

"రండి.. రండి" అంటూ ఆహ్వానించాడు.

"ఇన్నాళ్ళకి మళ్ళీ సాయంత్రంపూట నువ్వు యింట్లో వుండటం చూశానోయ్.... పార్వతి వచ్చేసిందేమోనని అనుమానం కూడా కలిగింది. ఓ సారి పలకరించి పోదామని యిలా వచ్చాను అంటూ కూర్చున్నాడు.

విశ్వనాథం అప్పుడు రావడం రాజారావుకి యేమీ యిష్టం లేదు. అలాగని, వచ్చిన వ్యక్తిని పొమ్మని చెప్పలేడుగా!

"ఏవబ్బాయ్, శాలువ కప్పుకుని వున్నావేం జ్వరంవచ్చిందా యేమిటి? అయివుంటుంది.... అందుకే యెక్కడికీ వెళ్ళావు కాదుగామోను. లేకుంటే నీ కాళ్ళు ఒక్క దగ్గరుంటాయా. నేనూహించింది నిజమేనా?" అనేశాడు గబగబా విశ్వనాథం.

రాజారావుకి అరికాలిమంట నెత్తికెక్కింది. ఈయనికి యివన్నీ యెవరడగమన్నారు. అని మనసులో అనుకున్నాడు.

"అబ్బే జ్వరంలేదండీ, కాస్త జలుబుచేసింది. కొద్దిగా చలివేస్తుంటేనూ, కప్పుకొన్నాను అనేశాడు.

"జ్వరం వచ్చేసూచనలే అవోయ్ జాగ్రత్తగావుండు.. పార్వతి వున్నపాటున వచ్చేయమని వుత్తరం రాయి. నీకు అంత ఓపిక లేకపోతే, మావాళ్ళనే రాయమంటానుండు..." అన్నాడు విశ్వనాథం.

రాజారావుకి నిజంగానే కోపం వచ్చింది. అయినా కోపంతో సాధించే కార్యం కాదనుకున్నాడు.ఆయన వుత్తరం రాయించేస్తే తనకి యెంత అవమానం? చేతకాక ఆమెను రప్పించుకున్నట్టేకదూ! ఇంక పార్వతి అహంకారానికి హద్దులుంటాయా?...

"అబ్బే: వుత్తరమెందుకండీ! నేనే అక్కడికి వెళ్ళిపోవాలనుకుంటున్నాను..." అనేశాడు పెద్ద అబద్ధం అడ్డుగా పెట్టి. తను వెళ్ళడం మాట అటుస్తే, రెండు మూడు రోజులు పోయాక తన ఆరోగ్యం బావుంటే, పార్వతి రావటం ప్రసక్తే వుండదని అతని భావం.

"ఎప్పుడు వెళ్తున్నావోయ్?"

"రేపు, యెల్లుండిలో వెళ్ళొచ్చునండీ!"

"వెళ్ళవుతే! అదీ మంచిదే! నువ్వు వచ్చినప్పుడు వాళ్ళనీ తీసుకొచ్చేయొచ్చు. ఇంట్లో ఆడది లేకపోతే, మనపాటు కుక్కలు కూడా పడవ్...."

విశ్వనాథాన్ని నాలుగు తిట్టాలనిపించినంతగా వుద్రేకం వచ్చింది రాజారావుకి. ఆడవాళ్ళకి అంత ప్రాముఖ్యత నివ్వడం సహించలేకపోయాడు కాని, యేం చేస్తాడు? పెద్దవాడు అతణ్ణి యేమనడానికీ అంతరాత్మ అడ్డొచ్చింది.

"సరేనండీ! అలాగే చేస్తాను..." అన్నాడు గంపెడు కోపాన్ని దిగమింగుకుంటూ, విశ్వనాథం తృప్తిగా నవ్వుకున్నాడు.

రాధాకృష్ణ ఫ్లాస్కు పట్టుకుని వచ్చాడు.

"ఫ్లాస్కులో ఏమిటబ్బాయ్"? ప్రశ్నించాడు విశ్వనాథం.

"కాఫీ అండి!" రాధాకృష్ణ జవాబిది.

"కాఫీ హోటల్నుంచి తెచ్చావా?"

"ఔనండీ!"

"అదేవిటోయ్ రాజారావ్,పక్కనేవున్నాంకదా, ఒక్కమాట చెబితే, రెండు నిముషాల్లో కాఫీ తయారు చేసి యిచ్చేవాళ్ళం కదూ! ఇదేమీ బాపులేదోయ్! నువ్వెందుకంత బిడియపడతావో నాకేమీ అర్థంకాకుండా వుంది".

"మరేమీ లేదండి! ఈ వేళప్పుడు మీకు శ్రమకలిగించడం యిష్టంలేక" నాన్చివేశాడు రాజారావు.

"శ్రమేముందోయ్... ఛ. ఛా! ఏమీ చావు లేదు.." విసుక్కొన్నాడు విశ్వనాథం.

"ఇదిగోరా అనాసిన్" అంటూ అందించాడు రాధాకృష్ణ.

రాజారావు దాన్ని తీసుకుని "కాఫీ యివ్వరా!" అన్నాడు.

రాధాకృష్ణ కాఫీ అందించాడు. రాజారావు అనాసిన్ మాత్ర మింగేసి వేడి కాఫీ తాగాడు.

"ఈ రాత్రి జ్వర తీవ్రత చూసుకుని డాక్టర్ని పిలుద్దాం" అన్నాడు రాధాకృష్ణ.

రాజారావు గుండెల్లో ఆటంబాంబు పడింది.

విశ్వనాథం వింతగా చూస్తూ "జ్వరం లేదన్నావోయ్.... డాక్టర్ని తెస్తానంటాడేవిటీ యున నువ్వు నాతో అబద్ధం చెప్పావన్నమాట, ఈ పరిస్థితుల్లో పార్వతి లేకపోవడం ఏమీ బావు

లేదు. ఇరుగుపొరుగు వాళ్ళము వూరుకోకూడదు. రేపే వుత్తరం రాయిస్తానుండు మా ఆవిడ చేత.... వెంటనే వచ్చేయమంటాను...'' అన్నాడు.

రాజారావుకి చచ్చేభయం వేసింది. చెప్పరానంత కోపం వచ్చింది విశ్వనాథం మీద.

''మావాడుకూడా మీలానే అనుకొన్నాడండీ, నాకేం జ్వరం లేదు. జలుబు చేసిందంతే, మీరు పార్వతికి యేవుత్తరం రాయించ నక్కర లేదు. నేనే అక్కడికి వెళ్ళిపోతానుగా! అన్నాడు ఆత్రుతగా.

అంత అవగాహన చేసుకున్న రాధాకృష్ణ, రాజారావు పరిస్థితికి లోలోన నవ్వుకోకుండా వుండలేక పోయాడు.

''నువ్వంతగా చెప్తున్నప్పుడు నాకేం లేనాయ్ సింపు ం....'' అనేసి ''మరివస్తా... నీకేమన్నా అవసరమొస్తే యింటికొచ్చి అడుగు. బిడియ పడకు. పొరుగువాళ్ళం ఆ మాత్రం సహకరించక పోతే యెట్లా, వస్తా...'' అంటూ వెళ్ళి పోయాడు.

రాజారావు అతణ్ణి ద్వారంవరకూ సాగనంపి తిరిగివచ్చి గట్టిగా నిట్టూర్చాడు.

''హమ్మయ్య: పీడవదిలిందిరా! వచ్చేవారం రో అంటే, పార్వతిని వచ్చేయమని వాళ్ళావిడచేత రాయిస్తా నంటాడు మాడు. నిజంగా అంతపని చేస్తాడేమోనని భయం వేసింది. నుమా. అలాగే జరిగినట్టంటే, పార్వతికి మరింత అహం భావం వచ్చేసును....'' అన్నాడు.

''బావుందిరా, మీ సంభ్రమం మీరూను. మాడు—యిందులో యెన్ని చిక్కులున్నాయో హాయిగా తినుకుని కూర్చోక, యెందుకురా యివన్నీను....?'' అన్నాడు రాధాకృష్ణ.

''అని నవ్వడుగుతావేమిటి?''

''మరెవర్ని అడగమంటావు?''

''పార్వతి సంగతి తెలిసికూడా నువ్విలా అంటా వేమిటి?''

''తెలుసునసుకో! అయినా, ఆమె మాటంకు అక్కే పిలుపివ్వకుండా నువ్వు ప్రవర్తిస్తే, కొన్నాళ్ళకి ఆమె నోటికి తాళం పడుతుందిగా!''

''అది అఖరు ప్రయత్నమనుకో! అయినా, ముందుగా, యీ అనుభవం కలుగనీయ్... అప్పుడు దారికొస్తుంది''.

''ఆమె దారికొస్తుందో లేదోగానీ, యిప్పుడు నీదారి చూడు... ఎవరూ లేనట్టు యేమిటీ ఖర్మ?''

''ఏమీ లేదు లేరా! ఆపాటి కష్టం అనుభ వించక పోతే యెలా? ప్రయత్నిద్దాం....'' నవ్వుతూ అన్నాడు రాజారావు.

''సరే ప్రయత్నించు.... వస్తామరి.. నువ్వు విశ్రాంతి తీసుకో. రేపు వుదయం మళ్ళీ వస్తాను. అన్నాడు రాధాకృష్ణ.

''మంచిదిరా!'' అంటూ రాధాకృష్ణని సాగ నంపి తలుపువేసి మంచంమీద ఒరిగాడు రాజారావు. ఇల్లాలు ఇంట్లో లేకపోతే యిల్లు యెంత కళా విహీనంగా వుంటుందో, ననుకుంటూ నిద్రపోయాడు.

ముకుందం సెలవుకోసం దరఖాస్తు పెట్టాడు కాని వెంటనే దొరకదన్నారు. ఎప్పుడు సెలవు దొరకుతుందా ఎప్పుడు పార్వతిని తీసికెళ్ళి రాజారావు దగ్గర దిగవిడచి వస్తానా అని ఎదురు చూస్తున్నాడు.

ఓరోజు రాత్రి పన్నెండు దాటింది. అందరూ గాఢ సుషుప్తిలోవున్నారు. పార్వతి గుర్రు పెడుతూ నిద్రపోతోంది. ఏదో అలజడి విని పించి అంతా లేచారు. ముకుందం ఆత్రుతగా బైటికి నడిచాడు. ఎదురింట్లో ఏదో అలజడి జరిగినట్లు పసిగట్టాడు. అప్పుడే చాలా మంది అక్కడికి చేరారు. ముకుందం అక్కడికి చేరు కున్నాడు.ఏంజరిగిందో తెలిక వినడానికి ఆసక్తితో ముకుందంరాకకై ఎదరుచూస్తూ నిల్చున్నారు సుభద్రమ్మ, పార్వతీను.

కాస్సేపటికి అక్కడ చేరిన వారంతా క్రమంగా వెళ్ళిపోయారు. ఒక్కొక్కరే ఏవో విమర్శలు వెళ్ళబోస్తూ నవ్వుకుంటూ వెళ్ళిపోతున్నారు. అవేవా స్పష్టంగా బోధపడలేదు. సుభద్రమ్మకి పార్వతికీను.

ఇంతలో ముకుందం గొణుక్కుంటూ తిరిగి వచ్చాడు.

''ఏం జరిగిందండీ? దొంగలు పడ్డారా ఏమిటి అంది సుభద్రమ్మ.

''దొంగలు కాదనుకో! ఇల్లాంటివారే జొరబడడానికి ప్రయత్నించారు'' అంటూ లోపలికి నడిచాడు. సుభద్రమ్మ అతణ్ణి అనుస రిస్తూ.

''ఎవరండీ?'' అంది. పార్వతి తలుపుమూసి లోపలికి నడిచింది.

''ఆడది హాయిగా ఎవణ్నో పెళ్ళి చేసుకుని సంసారం చేసుకోకూడదూ? ఊహూ! మగాళ్ళతో సరిసమానంగా సర్వహక్కులూ కావాలంటూ ఉద్యోగాలు చెయ్యడానికి ఎగబ్రాకుతుంటారు. పోనీ చదువుకున్నారు కనుక ఉద్యోగాలు చెయ్యం డయ్యా యెవడొద్దన్నాడు? కాని పెళ్ళి చేసు కుని భర్తకి యిష్టమైతే ఉద్యోగం చేయాలి అప్పే ఆలా ఎందుకు చేస్తారు? స్వతంత్రంగా జీవిస్తాం. మాకు మగాళ్ళ సహకారం అక్కర్లేదు అంటే యిదిగో యిలాగే జరుగుతుంది......'' అసలు విషయం చెప్పకుండా విమర్శ సాగించా డాయన.

ఆయన చెప్తుంది వేదవతిని గురించేనని, యిట్టే అర్థం చేసుకుంది పార్వతి. ఏం జరిగిందో తెలుసుకోవాలన్న ఆసక్తీ, వుబలాటం వున్నా పైకి తొణికితే ప్రమాదం అనుకుని గంభీ రంగా వూరుకుంది.

''అసలు జరిగిందేమిటి చెప్పకుండా ఇదంతా ఎందుకండీ?'' అంది సుభద్రమ్మ.

పార్వతి ప్రక్కగదిలోంచి శ్రద్ధగా విన సాగింది. ముకుందం మొదలు పెట్టాడు.

''ఇంటిగల ఆసామి సుబ్బయ్య లేడూ? అతని కొడుకు యీ మధ్యనే దేశయాత్ర ముగించు కొని యీ వూర్ని వుద్ధరించడానికి తిరిగి వచ్చాడు కదూ? అతడు మస్తుగా తాగేసి వచ్చి మెల్లగా ఆ అమ్మాయి లేదూ ఆ గది తలుపు తట్టాడుట. రెండు, మూడు పిలుపులు పిల్చా డుట కూడాను. ఆ అమ్మాయికి మెలకువ వచ్చి చూసిందట. ఆయన అంత రాత్రివేళ రావడం ఆమెకి భయం కలిగించిందట. తలుపుమాత్రం చెయ్యలేదుట. యిక నోటికొచ్చినట్టంతా కూయ డం ప్రారంభిచాట్ట ఆయన. ఆ అమ్మాయి మాత్రం ఏం చేస్తుంది? మగాడంటూ ఇప్పట్లో ఎవరో వుంటేకదా, బైటికివచ్చి బుద్ధి చెప్పడానికి లోపల్నుంచే కేకలు వేసిందట. ఇంటాయన ఇంకా తతిమ్మా వాళ్ళూ నలుగురూ సుబ్బయ్యను చూశాక ఎవరూ ఏమీ అనలేక పోయారు. ఎవరిదారిన వాళ్ళు పోయారు. ఇదీ సంగతి మగాళ్ళసహకారం లేకుండా బ్రతగ్గలమ్ మని కబుర్లు చెప్పే వాళ్ళే మళ్ళీ ఆమగాళ్ళ సహాయమే అర్థిస్తున్నారు. నవ్వుతూ ఉపన్యాసం ముగించాడు ముకుందం.

తనమీద తెచ్చివేశారనుకుంది పార్వతి అంతా విని. తండ్రికి జవాబు చెప్పాలనుకుంది గాని ఏం చెప్పాలో బోధపడక వూరుకుంది.

''అక్రూరడికేం పోయేకాలం పట్టిందండీ?'' అంది అసహ్యంగా సుభద్రమ్మ.

''పోయేకాలమేమిటి? అదోరకమైన ప్రేమ కలాపం.....'' నవ్వుకుంటూ అన్నాడు.

''చాల్లెండిక.... పడుకోండి.....'' అనేసింది యింకా విషయం పెంచకూడదనుకొని.

క్రమంగా అందరూ నిద్రదేవత ఒడిలోకి పోయారు.

మరునటి రోజు ఉదయం పది దాటింది. వేదవతి పార్వతి యింటికి వచ్చింది. ఆమె ఎప్పుడూ తరచుగా వాళ్ళింటి వచ్చేదికాదు. అదీగాక ఆవేళప్పుడు రావడం ఆశ్చర్యకరమే. పార్వతి చాపవేసి కూచోమంది ఇద్దరూ కూచు న్నారు.

''ఈవేళ నేను వెళ్ళిపోతున్నానండీ'' అంది వేదవతి.

''ఎక్కడికి?''

''మా వూరు......'' ముక్తసరిగా అంది.

''ఏం? ఇంత అకస్మాత్తుగా వెళ్ళిపోతున్నా రేం?'' గతరాత్రి జరిగిన సంఘటన తెలుసుండీ కూడా తనలా అడగడంలో అర్థం లేదని పార్వతికి తెలుసు. అయినా వివరంగా విషయం తెలుసుకోవాలని అలా అడిగింది.

వేదవతి గట్టిగా నిట్టూర్చింది.

''రాత్రి జరిగిన సంఘటన మీరు వినే వుంటారే'' అంది.

''విన్నాననుకోండి. అయినా ఆపాటి విషయానికే భయపడి వెళ్ళిపోతున్నారా?''

''ఔను: నా జీవితం కత్తిమీద సాములా వుంది. అది నాకు సరిపడ్డం లేదు.''

''ఉద్యోగం వదులుకుంటున్నారా?''

వు "రాజీనామా యిచ్చి వచ్చేశాను. ఇంక నేను ఉద్యోగం చెయ్యదల్చుకోలేదు. వివాహం చేసుకుని హాయిగా జీవిస్తాను" అంది వేదవతి.

"ప్రతి చిన్న విషయానికీ భయపడితే లాభం లేదండీ! ప్రతిఘటించే శక్తి తెచ్చుకోవాలి. ధైర్యం కూడగట్టుకోవాలి. అప్పుడే మనమూ ముందుకు సాగిపోతాం" అంది పార్వతి.

"మీరెన్నీ చెప్పండి. . .ఏవిటో నాకీస్వతంత్ర జీవితమ్మీద విరక్తి పుట్టింది. పురుషులకు మన మీద గౌరవం యేర్పడేవరకూ, మనసాంఘికవ్యవస్థ మారే వరకూ మనం ముందుకు పోలేమని నావ్యక్తిగతమైన అభిప్రాయం. . .మిమ్మల్ని నేనెందుకు నిరుత్సాహ పర్చాలి. . .ప్రయత్నించండి. సాధించగలిగితే, సంతోషించే వాళ్లలో నేను మొదటి దాన్ని. వస్తామరి. . .మధ్యాహ్నం బండికేపోతున్నా వీలుంటే, యెప్పుడన్నా కలుసుకొందాం. . ." అంటూ లేచింది వేదవతి. "వెళ్ళిరండి. ." అంది పార్వతి. వేదవతి వెళ్లిపోయింది. పార్వతి మెల్లగా నవ్వుకుంది.

ఆరోజు మధ్యాహ్నం పార్వతికి ఓకవరు వచ్చింది. ఆకవరు అందుకున్న పార్వతి ఆనందానికి హద్దుల్లేకపోయాయి. కవరు విప్పింది. ఇంటర్వ్యూకి రమ్మన్నారు ఆదివారం. ఆమె గుండెల్లో రాయి పడింది. మరోరోజు యేదైనా అవుతే, సుళువుగా వెళ్ళడానికి అవకాశ ముండేది. ఆదివారం, తండ్రి యింట్లోనే వుంటాడన్న భయం ఆవరించింది. ఒకప్రక్క సంతోషం మరోవేపు భయం సంఘర్షణ పడుతున్నాయి.

ముకుందం ఆరోజు మధ్యాహ్నం కాస్తంత వేగిరం యింటికి వస్తున్నాడు. త్రోవలో పోస్టుమాన్ అగుపిస్తే వుత్తరాలేమైనా వున్నాయేమోనని అడిగాడు. అమ్మాయి చేతికి ఒక వుత్తరం యిచ్చానని చెప్పాడతడు. బహుశా అది అల్లుడి దగ్గర్నించే వచ్చి వుంటుందని వూహించుకుని ముందుకు సాగిపోయాడు ముకుందం.

ఇంట్లోకి వచ్చి బట్టలు మార్చుకుని వాలుకుర్చిలో చేరబడి పార్వతిని కేకేశాడు.

"ఏం నాన్నా?"అనుకుంటూ వచ్చింది పార్వతి.

"ఏదమ్మా ఆ వుత్తరం ?" అన్నాడు.

పార్వతి గతుక్కుమంది.

"ఏవుత్తరం నాన్నా?" అంది తడబడుతూ.

"ఇవ్వాళ పోస్టుమాన్ యిచ్చిన వుత్తరమమ్మా. అలా చూస్తావేమిటి ? అల్లుడేగా రాశాడు ?"

పార్వతి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. నాన్నగారికి యెలా తెలిసింది చెప్మా ? అనుకుంది.

"మీకెలా తెలిసింది ?"

"పోస్టుమాన్ చెప్పాడమ్మా. . ."

ఏం చెప్పడమో, ఆమెకి అవగాహన కాలేదు. కాస్సేపు మవునంగా వూరుకుంది.

"ఏవిటమ్మాయ్, అలా వూరుకున్నావ్ ? ఏదా వుత్తరం. . .?" అన్నాడు మళ్లీ.

అబద్ధం చెప్పినా, దాన్ని కప్పిపుచ్చడానికి మరి కొన్ని అబద్ధాలు చెప్పాలనుకుని నిజం చెప్పడానికి నిశ్చయించుకుంది.

"ఆయన రాసింది కాదునాన్నా"

ముకుందం కూతురు వేపు ఆశ్చర్యంగా, వింతగా చూశాడు.

"మరెవరు రాశారు ?" అన్నాడు అనుమానంగా.

పార్వతికి నోటమాట రావడంలేదు. అతి ప్రయత్నమ్మీద చెప్పింది.

"వుద్యోగం కోసం దరఖాస్తు పెడితే, యింటర్వ్యూకి రమ్మని రాశారు నాన్నా. . ."

తృళ్లిపడ్డట్టు లేచి నిల్చుండిపోయాడు ముకుందం. అతని మొహం జేవురించింది. కళ్లు చింతనిప్పులా కణకణ లాడుతున్నాయి.

"ఏవిటి: దరఖాస్తు పెట్టావా! నేనుబ్రతికి వున్నాననుకున్నావా ? చచ్చాననుకున్నావా ? ఏవిటే, నీ సాహసం ? ఒద్దనీ యింతా చెప్పినా విన్పించుకోకుండా దరఖాస్తు పెట్టావా ? అట్టు భర్తను యెదిరించి, ప్రతిజ్ఞ పట్టి నన్నూ లెఖ్కచెయ్యకుండా, నేనొద్దన్న పనిచేశావు. మమ్మల్నందర్నీ యెదిరించి నువ్వుసాధించేదేవిటే? అసలు నీకీ దుర్బుద్ధి యెందుకు పుట్టిందో అర్ధంకావడంలేదు. నిన్నని యేం ప్రయోజనం? నిన్ను యింతవరకూ చదివించడం నాదేతప్పు. నాతప్పే నన్నిపుడు యెదిరిస్తోంది. . "గర్జించాడు ముకుందం.

"ఎదిరించడం కాదునాన్నా" ప్రాధేయంగా అంది పార్వతి. "మరింక నువ్వు మాట్లాడకు. నన్నింక రెచ్చకొట్టకు. నీకు అంతగా ఆ స్వతంత్ర జీవితమ్మీద మమకారముంటే, నీయిష్టమొచ్చినట్టు ప్రవర్తించు. కాని, నాయింట్లో వుండి యివన్నీ సాగించడానికి వీల్లేదు ఖచ్చితంగా అనేశాడు.

తండ్రి అలా అంటాడని పార్వతికి తెలుసు. అయోమయ స్థితిలో కొట్టుకుంటూ నిరుత్తరై నిల్చుండి పోయింది. భర్తగొంతు విని యేదో కొంప మునిగిందని ఆతృతగా వచ్చింది సుభద్రమ్మ వంటగదిలోంచి.

"మళ్లీ యేమయ్యిందండీ?"అంది భయంగా.

"ఏమయ్యిందో,నీముద్దుల కూతుర్నే అడుగు. మనం యిలా మర్యాదగా బ్రతకడం దానికిష్టం లేనట్టుంది" అనేసి చరచరా అక్కణ్ణించి పోయాడు.

"ఏమయ్యిందే పార్వతీ?" అంది సుభద్రమ్మ.

పార్వతి అంతా చెప్పింది.

"నాన్నగారి సంగతి తెలిసుండి కూడా నువ్విలా మొండికెత్తి ప్రవర్తించడం యేమీ బావులేదే. యెందుకొచ్చిన పంతాలు చెప్పు. . .మన వంశంలో స్త్రీలు యింతవరకూ యెవరూ వుద్యోగాలు చేసి యెరుగరు. చూశావా ఆ వేదవతి ఒంటరిగా జీవించలేకనే వుద్యోగం విడిచిపెట్టి పోయిందట. నామాటవిని యీపట్టింపులు మానుకో"అంది.

తనకి అందరూ పిరికి మాత్రలే వేస్తున్నారు యింక ముందుకు సాగేదెట్లా?.... తనిప్పుడేం చెయ్యాలి? దేహి అనుకుని మళ్లీ భర్త దగ్గరకే పోవాలా? ఔను.... అంతే అస్వతంత్రులు చెయ్యాల్సిన పని అదేమరి. అనుకుంది పార్వతి.

ఆమె కళ్లు అశ్రుపూరితాలయ్యాయి. మరేమీ మాట్లాడలేక పోయింది.

సుభద్రమ్మకి కూతురి అవస్థ బాధ కలిగించింది. అయినా పరే యేం చేస్తుంది? కూతురి తల నిమురుతూ :

"బాధపడకమ్మా! స్త్రీ పురుషుల వివాదంలో ఎప్పుడూ ఓటమి స్త్రీనే వరిస్తుంది. యిది సహజం. అందుకు మనం బాధపడ్డం తప్పదు. యింకేం చెయ్యలేం" అనేసి వెళ్లిపోయింది.

పార్వతి భారంగా అడుగులు వేసుకుంటూ తన గదిలోకి పోయింది.

ముకుందం వసారాలో వాలుకుర్చీలో చేరబడి వున్నాడు. అతని మెదడు అల్లకల్లోలంగా వుంది. ఇన్నాళ్ల జీవితంలో యిల్లాంటి సమస్య అతని కెప్పుడూ ఎదురవ్వలేదు. పార్వతి ఉద్యోగం చేస్తే పరిణామాలెలా వుంటాయి. అని తల పోశాడు. రాజారావు మనసు మార్చుకుని విడాకులకై పోరాడవచ్చు. అది అలా వస్తే ఇక్కడ ప్రతివాడూ ముకుందం గారమ్మాయిరా...... ఉద్యోగం వెలిగిస్తోంది.... మొగుణ్ణి వదలి వచ్చేసిందటగా. ఏమైందో ఏమిటో యిలా అంటారెన్నో.... ముకుందం ఇంకా ఆలోచించలేక పోయాడు. లేచి విసుగ్గా పచారు చేయటం ప్రారంభించాడు. ఒకే ఒక్క మార్గం......... పార్వతిని తీసుకుపోయి అల్లుడి దగ్గరకు చేర్చడం కాని పార్వతి ఒప్పుకోవడం లేదే ఒప్పుకోకపోతే బలవంతంగా ఒప్పించాలి. అదే ఉత్తమ మార్గం అనుకున్నాడు.

సరిగ్గా అదే సమయానికి సుభద్రమ్మ అక్కడికి వచ్చింది.

"మీ సెలవు ఏమైందండీ" అనుకుని

"దొరుకుతుంది. ఏం? " కోపంగా అన్నాడు.

"అమ్మాయితో వెళ్తారేమోనని...."

"ఎక్కడికి? అది ఉద్యోగం చేసేదగ్గరికా?"

"అబ్బబ్బా! మీతో వచ్చిన చిక్కే యిదండీ సమంగా చెప్పేదంతా వినకుండా చిర్రు బుర్రు మంటారెందుకు?"

"సరే చెప్పు....."

"దాంతోపాటు మీకు కూడా అల్లుడి దగ్గరకు వెళ్లండి......"

"ఔను అది ఒప్పుకుంటేగా చిన్నపిల్లగనకనా నాలుగు లెంపలేసి ఒప్పించడానికి?"

"ఒప్పుకుంటుంది..... మీరు సెలవు తీసుకుందురూ....."

"అలాగవుతే సరి నువ్వు కాస్త నచ్చజెప్పు" వుత్సాహంగా అన్నాడు..

"అలాగే" అంటూ లోపలికి పోయింది. సుభద్రమ్మ

ముకుందం తృప్తిగా నిట్టూర్చి వాలుకుర్చీలో కూలబడ్డాడు.

## —7—

రాజారావు ఆరోగ్యం కుదుటపడింది. కాని అతినికింకా హోటల్ భోజనం తినబుద్ధి పుట్టలేదు. రోజూ అవే కూరలు అదే సాంబారు అదే పచ్చడి, మార్పంటూ లేదు. అన్నంలో రాళ్ళు పగానికిపైగా వున్నట్టుగా వుండటం మరింత విసుగు పుట్టించింది. ఒక్కరోజు అన్నం అన్నంలా కాకుండా పేస్టు ముద్దలా తయారయేది. కిక్కురుమనకుండా రెండు ముద్దలు కెతికి వచ్చేసేవాడు. యీ విధమైన భోజనం తిని 'రుచి' అన్నది మరచిపోయాడు. అందుకే యిక హోటలు భోజనానికి స్వస్తి చెప్పాలనుకున్నాడు. ఇంట్లో వంట ప్రారంభించాడు. కాసిన్ని బియ్యం పొంగించుకొని పప్పూ, చారు చేసుకుని తీరిక ఒక్కరోజున చేతనైనట్టు కోరి వండుకొని పెరుగుతో సుష్టుగా భోజనం చేసేవాడు. హోటలు భోజనం కంటే యిది ఎన్నోరెట్లు నయమనిపించిందతనికి. కాని ఆఫీసులో లేటు తప్ప రోజు లేదు. ఆఫీసులో బొత్తిగా అస్వతంత్రుడు కాదు. గాబట్టి సరిపోతుందిగాని లేకుంటే ఎన్ని చీవాట్లు తినేవాడో!

ఓరోజు ఉదయం రాజారావు కాఫీ హోటలుకి పోయి తిరిగి వచ్చాడు కాఫీతాగి. వంట ప్రయత్నం ప్రారంభించాడు. రోజుకులా పొయ్యి ముట్టించి బియ్యం పెట్టాడు. సరిగ్గా అప్పుడే రాధాకృష్ణ వచ్చాడు.

"బావుందిరా నీ ప్రాక్టీసు. కొన్నాళ్ళకి ఇలా అవుతే ఆఫీసులో ఉద్యోగం నువ్వు వదులుకో వాల్సి వస్తుందేమో చూడు మొన్నను నువ్వు లేటుగా వచ్చావని సీనియర్ అకవుంటెంటు ఎంతగా విసుక్కున్నాడో ఎందుకు చెప్పు యీ రాద్ధాంతాలు ఏవో ఆవేశాల వల్ల జరుగవలసినవి జరిగాయి. ఇంకెందుకీ పట్టుదలలు పార్వతిని వచ్చేయమని ఉత్తరం వ్రాయి నావల్ల మీ యింట్లో యిల్లాంటి కలతలు రావడం నాకే కష్టమనిపిస్తుంది. అన్నాడు.

"అబ్బే! నీవల్లేం కాదులేరా! ఎప్పుడో ఓసారి యిల్లాంటి సంఘటన తీసుకొచ్చి పార్వతికి కనువిప్పు కలిగించాలని నా మనసులో వుండేది. అది యిప్పటికి ఆచరణలోకి వచ్చింది. దీనికి నువ్వేం బాధపడకు. ఆమె అర్థం చేసుకున్నాకే వస్తుంది తిరిగి....." అన్నాడు రాజారావు నవ్వుతూ.

"అక్కడే నువ్వు పొరబడుతున్నావురా ఆమె ఏదో బాధపడి పశ్చాత్తాపంతో తిరిగి వస్తుందని నువ్వాశిస్తున్నావు. అలా జరిగితే జరుగవచ్చు కాని నువ్విపుడు ఎన్ని శ్రమలకు లోనవుతున్నావో వూహించావా? మాట పట్టింపుకోసం యిరువురూ బాధలు పడి ఏం సాధిస్తారు? చివరికి ఫలితం ఏమిటి? సుఖంగా గడుపుకొస్తున్న సంసారాన్ని దుఃఖమయం చేసుకోవడమేనా? నామాటవిని పార్వతికి ఉత్తరం వ్రాసేయ్"

రాజారావు చిన్నగా నవ్వి వెంటనే సీరియస్ నెస్ తెచ్చి పెట్టుకున్నాడు..

"ఒరేయ్ రాధా!" అన్నాడు గంభీరంగా.

"చెప్పు. . ."

"నువ్వు చెప్పింది నాకూ అర్థమయ్యిందిరా! ఈనాడుకాదు. . .నాకు యెప్పట్నుంచో తెలుసు, స్త్రీ పురుషులు ఒకరినొకరు సహకరించుకుంటేనే గాని, సంసారం సాగదని. కాని, పార్వతి యెందుకా విషయం గ్రహించదా, అన్న పట్టుదలే నన్నింత దూరం తెచ్చింది. కొద్దిరోజులు యిలాగే గడవనీయ్. . .చూద్దాం. . ."

గడియారం తొమ్మిది కొట్టింది. "అప్పుడే తొమ్మిదయ్యింది. ఇంక, నీవంట అయ్యేదెప్పుడురా! లే. . .మాయింటి దగ్గర యివ్వాల్టికి భోంచేద్దువుగాని. . ." అన్నాడు లేస్తూ రాధాకృష్ణ.

అప్పటికే పొయ్యిదగ్గర కూచోలేక విసుగుతో నిండిపోయిన రాజారావుకి, స్నేహితుడి మాటలు అమృతపు వాక్కుల్లా విన్పించాయి.

"అంతే అంటావా ?" అన్నాడు మెల్లగా.

"అన్నమాటే! లేకపోతే యెప్పుడు వండుతావు. . .ఎప్పుడు భోంచేసి బయల్దేరతావు ?"

"సరే అవుతే: పద. . ."పొయ్యిమీద తప్పేలా దించేసి మొహం కడుక్కుని బైలుదేరాడు బట్ట లేసుకుని.

"వస్తున్నావుగాని, అక్కడ వంట వండింది పద్మ. ఆమె స్త్రీయేగా!" నవ్వుకుంటూ అన్నాడు రాధాకృష్ణ.

"అబ్బే! ఆపట్టుదల లేనేలేదురా! పార్వతికి కాస్తంత బుద్ధిచెప్పాలని యీవిధంగా పట్టుబట్టేనేగాని, అదో ప్రతిజ్ఞ అనుకుంటున్నావా అలా అవుతే, ఒక్కక్షణం బ్రతగ్గలమా ? నాకు మాత్రం తెలీదా యేమిటి! పద. . ." నవ్వుతూ అనేసి ముందుకు సాగిపోయాడు.

రాధాకృష్ణ యింకేమీ అనలేకపోయాడు. రాజారావు అభిప్రాయం కొంతవరకూ సమంజసంగా వున్నా, యీపట్టుదల యెల్లాంటి పరిణామాలకు దారితీస్తుందో నన్నభయం లోపల వుండనే వుంది. కొద్దిరోజులు చూసి స్వయంగా కలిగించుకోవాలని నిశ్చయించుకున్నాడు.

## 8

మావగారి టెలిగ్రామ్ అందుకుని విజయోత్సాహంతో స్టేషనుకి వచ్చిన రాజారావు, బండి నుంచి తండ్రీ కూతుళ్ళిద్దరూ దిగడం చూసి ఆశ్చర్యపోయాడు. మావగారు వస్తారని అతను అనుకోలేదు. మావగార్ని పలకరించాడు.

"వచ్చేశావా పార్వతీ!" అంటూ చిన్నగా నవ్వి బాబును అందుకున్నాడు.

రాజారావు నవ్వు, పార్వతి గుండెల్ని బాణంలా దూసుకుపోయింది. ఆమాటలోనూ, నవ్వులోనూ యేదో ఆధిక్యత అగుపిస్తున్నట్లు నేనే గెలిచాను సుమా అని గేలిచేస్తున్నట్టు, అనిపించిందామెకి. బాధతో కుంచించుకు పోయింది. తను ఓడిపోయింది. కాదు. . .తనని అసహాయురాలుగా చేశారు నాన్న. . . అనుకుంది.

"టెలిగ్రామ్ యిచ్చారు చాలదూ ? మీరు రావాలా మావగారూ ?" అన్నాడు రాజారావు.

వస్తే, యిప్పుడు పోయిందేమిటోయ్!" అనేశాడు తేలిగ్గా ముకుందం.

స్టేషను అవరణనుండి బైటపడ్డారు. సామానుతో తను ఒక రిక్షాలో కూచుంటానంది పార్వతి. రాజారావుకి నచ్చాగింది కాదు. అలాగే కూచోమన్నాడు. మావా, అల్లుడూ, ఓ రిక్షాలో కూచున్నారు. రిక్షాలు కదిలాయ్.

ఇల్లు చేరుకున్నారు. లోపలికి అడుగు పెడుతూనే, పార్వతి చుట్టూ ఓమారు కలయజూసింది. ఇల్లంతా శుభ్రంగానే వుంది. తను ఆశించిన విధంగా చిందరవందరగా వుండకపోవడం, ఆమెను నిరుత్సాహపర్చిందనే చెప్పాలి. ఆమె అభిప్రాయాన్ని గ్రహించేశాడు గామోసు రాజారావు "ఏమిటి పార్వతీ! యీ పరకాయించి చూసున్నావేమిటి? ఇల్లు శుభ్రంగా వుందనా! ఆడది లేకపోతే, యింటిని శుభ్రంగా వుంచడం మగాళ్ళకి చేతకాదనుకోవడం శుద్ధ పొరపాటు" అన్నాడు. 'టెలిగ్రామ్ అందుకున్నాక శ్రమ తీసుకుని యిల్లంతా శుభ్రం చేశాడన్న విషయం ఆమెకి యెలా తెలుస్తుంది?

ఇది తనపై ప్రయోగించిన మరో అస్త్రం అనుకుంది పార్వతి. తను ఓడిపోయినందుకు మనసులో యెంతగానో బాధపడింది. ఆ బాధ బహిర్గతం కాకుండా అణచి పెట్టుకుందుకు ప్రయత్నించి, కృత్రిమంగా ఓ చిన్న మందహాసం చేసింది.

"ఆ యీకబుర్లు కేంలెండి. . .ఒకటి రెండు రోజులు యిలావుస్తేసరా?" వెటకారంగా అంది.

అదే సమయమన్నట్టు, రాజారావు దగ్గరున్న బాబు 'కంయ్' మన్నాడు. సముదాయించడానికి బ్రహ్మప్రయత్నం చేశాడు రాజారావు. అబ్బే ఆకుంక వూరుకుంటేనా ?

"మీ అమ్మదగ్గిరికే వెళ్ళరా" అనేసి పార్వతికి అందివ్వబోయాడు బాబుని.

పార్వతి సగర్వంగా నవ్వింది. "ఆమాత్రం పిల్లణ్ణి సముదాయించలేకపోతే యింకేమిటండీ ? కాస్సేపు మీదగ్గర వుంచండి. నేనింక వంట ప్రయత్నం చెయ్యొద్దూ ?" అంది,.

"ఈపూటకు వంట ప్రయత్నం పెట్టకు పార్వతీ! కేరియర్లు తెచ్చేస్తాలే!" అంటూ బాబుని ఆమెకు అందించాడు.

అప్పుడే స్నానం ముగించి వచ్చిన ముకుందం కేరియర్ పట్టుకు బైలుదేరిన అల్లుణ్ణి చూశాడు.

"వంట పెట్టేసుకుంటే కాదటోయ్ ?" అన్నాడు.

"ఎందుకులెండి మావగారూ! హోటలు టికెట్లు వుండిపోయాయిగా తీసుకొచ్చేస్తాను. ప్రయాణం చేసి తర్వాత వంట చెయ్యాలంటే కష్టం కదూ! అనేసి వెళ్లిపోయాడు.

ముకుందం గదిలోకి పోయాడు.

పార్వతి బాబుని కింద వుంచేసి చీపురు పట్టుకుంది యిల్లు వూడ్చేందుకు. కాని బాబు ఏడుపు లంకించుకున్నాడు. పార్వతి ఒకటి రెండు సార్లు విసుక్కుంది కూడాను. అయినా బాబును తియ్యలేదు. బట్టలు వేసుకుని వచ్చిన ముకుందం బాబు నెత్తుకున్నాడు.

"చూడమ్మా పార్వతీ! యింత మంచి భర్తను కట్టుకొని హాయిగా సంసారం గడపడరి మానేసి పంతాలు పెట్టుకుందుకు నీకెలా మనసొప్పుతుందో నాకర్థం కావడం లేదు. వద్దమ్మా! పంతాలు, ప్రతిజ్ఞలు, ఆవేశాలు, వద్దమ్మా! అవే ఒక్కోప్పుడు బంగారం లాంటి కాపరాల్ని బుగ్గిపాలు చేస్తాయి. ఆడది ఎప్పుడూ మగవాడికంటె ఓ మెట్టు దిగువగా వుండడం అన్నివిధాలా శ్రేయస్కరం" అన్నాడు ముకుందం ? కూతురికిజ్ఞానోదయం కలిగించాలనేఆకాంక్షతో.

పార్వతి పల్లెత్తు మాటైనా అనలేదు. ఆమె మౌనం గ్రహించి మళ్లీ మొదలుపెట్టాడు ముకుందం.

"స్త్రీలు స్వేచ్ఛగా స్వతంత్రంగా జీవించలేరని చెప్పడం కాదు నా అభిమతం. ప్రస్తుతం మన సాంఘిక వ్యవస్థ రీత్యా అదంత సులభంకాదు. ఎన్నో అవాంతరాల్ని ఎదుర్కోవలసి వుంటుంది. ఎన్నోయిక్కట్లు పడాల్సి వుంటుంది. అసంఖ్యాకమైన అపవాదుల్ని నెత్తిన వేసుకోవాల్సి వుంటుంది. సుఖాన వున్న ప్రాణం దుఃఖాన పడేసుకోవడం తప్పించి, మరేమీ లేదు. మరింకెప్పుడూ యిలాంటి పిచ్చివేషాలు వెయ్యకు. హాయిగా సంసారం చేసుకో. నామాటకు విలువనిస్తావని నాకు నమ్మకముంది" అన్నాడు.

ఇప్పుడూ ఏమీ మాట్లాడలేదు పార్వతి. ఇల్లూడ్చడం పూర్తి అయింది. వంట గదిలోకి పోయి ఏవో సామాను సర్దుకుంటుంది. ఇంకా ఏం చెప్పడమా! అన్న ఆలోచనల్లో పడి వూరుకున్నాడు ముకుందం.

ఇంతలో రాజారావు కేరియర్ తీసుకొచ్చాడు. భోజనాల ఏర్పాటు చేసింది పార్వతే.

ఆరోజు రాత్రి అల్లుడూ, మామా ఆరుబైట మంచాలు వేసుక్కూర్చున్నారు. కాస్సేపు అవీ యివీ, మాట్లాడుకున్నాక ముకుందం అసలు ప్రస్తావనలోకి దిగాడు.

"ఏమిటోయ్ రాజు పార్వతి ఉద్యోగం చెయ్యాలన్న ప్రయత్నంతో అక్కడికి వచ్చింది ఏమిటి విశేషం?" ఏమీ తెలీనట్టుగానే అడిగాడు.

రాజారావు అదోలా నవ్వాడు.

"అంతవరకూ తెలిసినప్పుడు విషయమంతా వివరంగా మీకు తెలీకుండా వుంటుందా మామగారూ? లేకపోతే నానోట వినాలని యిలా అడుగుతున్నారా?" అన్నాడు రాజారావు.

అల్లుడు అంత వేగిరం పట్టుబడడని ముకుందంకి తెలుసు. చిన్నగా నవ్వుకున్నాడు.

"సరేగాని అదేదో తెలివితక్కువ వల్లనైతేనేం, చిన్నతనం వల్లనైతేనేం అలా అన్నదేఅనుకో! నువ్వూ తొందరపడతావటోయ్?" అన్నాడు ముకుందం.

"తెలివి తక్కువతనమేమీటుంది! చదువుకుంది! సంస్కారం జీర్ణించుకుంది. సంసారం సాగిస్తూ ఓ బిడ్డ తల్లీ అయింది. స్త్రీల హక్కులకోసం పాటుపడుతోంది. ఇల్లాంటి వ్యక్తి తెలివి తక్కువదంటే ఎవరైనా నమ్ముతారా చెప్పండి. తెలివి తక్కువ కాదు. చిన్నతనమూ కాదు. అదో విధమైన అహంభావం ఆధిక్యత తెలియజెయ్యాలనే ఆకాంక్ష ప్రతిరూపం ఆమె అహంభావం ఆమెకి తెలుస్తుందనే భావనతో తన ఆశయాన్ని ఆచరణలో పెట్టుకున్నాను. అంతేగాని, నాకు మరో ఉద్దేశ్యం లేదు.'

"పరిస్థితి ననుసరించి నీ అభిప్రాయం బాగానే వుందోయ్ కాని, నువ్వు తొందరపడ్డావనే చెప్పాలి. పార్వతి ఉద్యోగం చేస్తే వచ్చే అనర్థకాలు ముందుగా ఆలోచించలేదు. ఆవేశంలో ఆ ఆలోచన లేకపోయింది. నువ్విక్కడ, పార్వతి మరోచోట మీ యిరువురి మధ్య ఆ పసికందు నలిగి పోయేవాడు. మీ యిరువురిలో విడివిడిగా ఎవరి బాధ వాళ్లకున్నా పట్టుదల దాన్ని అణచివేస్తుంది. కావేషాలు పెరుగుతాయి. మనసులు విరుగుతాయి. మళ్లీ మీ యిద్దరు ఏకమవడానికి ఎంతకాలం పడుతుందో మీ మనస్సులోని ఉద్రేకాలు సమసిపోయేందుకు ఎంత వ్యవధి పడుతుందో ఎవ్వరూ చెప్పలేరు. ఇవన్నీ యోచించి ముందే దాని అభిప్రాయాన్ని తేలిగ్గా కొట్టిపారేస్తే పోయేదిగా."

"ఎప్పుడూ అలానే చేస్తూండేవాణ్ణి కాని, ఆరోజు అలా ప్రవర్తించాల్సి వచ్చింది లెండి. పార్వతి ధైర్యం చూడండి నన్ను ఎదిరించింది. మీరు ఆమెతో ఏకీభవించారన్న విషయం తెలుసు.... అయినా సరే ప్రయత్నం కొనసాగించిందంటే అందుక్కారణం ఆమెలో హెచ్చుగా వున్న ఉద్రేకమనే చెప్పాలి. ఆమె ఎలాగా నెగ్గలేదన్న ధైర్యం తోనే నేనూ 'వూ'కొట్టాను అని ముగించాడు రాజారావు.

"పెద్దవాణ్ణి చెప్తున్నాను. ఇల్లాంటి పంతాలు పెట్టుకోకండోయ్ సాఫీగా సంసారాన్ని సాగించడంలోనే ఎంతో ఆనందం వుంది." తను యింతకంటే చెప్పాల్సిందేమీ లేదన్నట్టుగా వూరుకున్నాడు ముకుందం.

రాజారావు మాత్రం యింకేం చెప్తాడు ? "చాలా వేళవుతోంది. పడుకోండి. రేపు మళ్ళీ ప్రయాణ మంటున్నారు. . ." అన్నాడు రాజారావుయింట్లోపలికి దారి తీస్తూ.

## 9

పార్వతి వచ్చేసిందని తెలిసి రాధాకృష్ణ, పద్మ వచ్చారు అప్పటికి రాజారావు యింటోనేవున్నా ఇద్దర్నీ ఆప్యాయంగా ఆహ్వానించాడు. పద్మ లోపలికి పోయింది. పార్వతి దగ్గరికి. రాధాకృష్ణ రాజారావు కెదురుగా కుర్చీలో కూచున్నాడు.

"నువ్వు వుత్తరం రాశావేమిట్రా ?" అన్నాడు రాధాకృష్ణ.

"లేదురా! నాన్నగారి బలవంతమ్మీద వచ్చేసినట్టుంది.ఏదైతే మనకెందుకులే!" నవ్వుతూ అన్నాడు రాజారావు. "స్వయం పాకానికి స్వస్తిచెప్పినందుకు నిజంగా నీకంటె నాకు ఆనందంగా వుంది చెప్పకేంగాని నీఅవస్థ చూశ్ళేక పోయేవాణ్ణి . . .' అని యింకా చెప్పుకుపోతున్న రాధాకృష్ణ నాన్నటికి అడుకట్టగా, 'యిక ఆపు' అన్నట్టు చెయ్యి అడ్డంపెట్టాడు. రాజారావు

"గట్టిగా అనకురా పార్వతి విన్నదంటే యెత్తిపొడుస్తుంది. స్వయంపాకం వుద్యోగం సద్యోగం లేనివాడు పెట్టుకోవాలిగాని, వుద్యోగమున్నవాడు యిన్నిబాధలు పడలేడు, ఇకహోటల్ భోజనమంటావా, వారం రోజులపాటు ఆభోజనం రుచి చూశామంటే, మరి జీవితాంతం ఆకలి పుట్టదేమో ననిపిస్తుంది. ఇంట్లో మనవాళ్లు వట్టి పప్పుచారుతో అన్నం పెట్టినా అమృతప్రాయంగా వుంటుందనుకో. ఆవేశంలో పార్వతితో నేను ప్రగల్భాలు పలికాననుకో. తీరా నా అనుభవాన్ని తరచి చూస్తే, యేవిషయంలో చూసినా స్త్రీ పురుషులకు ఒకరి సహకారం ఒకరికి అవసర మన్పిస్తుంది. కాని, యీవిషయం బైటకి చెప్తామంటే, యిక వాళ్ళు మనమీద విరుచుకు పడతారు"

"ఎలాగవుతేనేం—గెలుపు నీదే" నవ్వుతూ అన్నాడు రాధాకృష్ణ.

"అదెప్పుడూ వున్నదేలేరా" అనేశాడు తేలిగ్గా.

తర్వాత యిద్దరూ యెన్నో విషయాలు మాట్లాడుకున్నారు.

పద్మ లోపలికి పోతూనే పార్వతిని చూసి "ఏం రా పార్వతీ!" అంది బాబుని అందుకుంటూ.

పద్మ మోహం చూడ్డానికే సిగ్గనిపించింది పార్వతికి. తను అకస్మాత్తుగా యెందుకు వెళ్ళిపోయిందీ ఆమెకి తెలీకుండా వుండదు. ఏమీ సాధించకుండా తిరిగి వచ్చినందుకు తన గురించి యేమనుకుంటుందో ? అనుకుంది. ఈ ఆలోచనల్లో పడి పద్మను కూర్చోమనలేదు కూడాను. చప్పున తేరుకుని.

"అలా నిల్చుండి పోయావేం? ఆ పీటమీద కూర్చో" అంది.

పద్మ కూచుంది. ఆమె కెదురుగా పార్వతి పీటవేసుకుని కూచుంది.

"అకస్మాత్తుగా యెవరికీ చెప్పకుండా వెళ్ళిపోయావేమిటి పార్వతీ ?" అంది పద్మ.

పార్వతి ఆశ్చర్యపోయింది. పద్మకి ఆవిషయం నిజంగానే తెలీదా ?

"నీకేమీ తెలీదా పద్మా! రాధాకృష్ణకి మావారు చెప్పేవుంటారే"

"చెప్పారనుకో. అది నిజమా అని ?"

"ఔను.. నిజమే. కాని చివరికి ఓటమినాదే అయ్యింది. నేను సాధించి రావాలనుకున్నాను.

కాని, నామార్గంలో మానాన్నగారు దాటలేని అగాధంలా వుండిపోయారు. నేను వుద్యోగం చెయ్యడానికి ఆయన ససేమిరా ఒప్పుకున్నారు కాదు. అందువల్ల ఆయన గౌరవ మర్యాదల భంగ పడతాయట. అంతేకాదు అక్కడ మా యింటి కెదురుగా ఓ లేడీ టీచరుందిలే! ఆమె నాకు మరి పిరికి మందు పోసింది. ఆమె విధిలేక వుద్యోగం చేస్తుందట గాని, లేకుంటే, హాయిగా పెళ్ళి చేసుకుని సంసారం సాగించేదట. నేనొచ్చేముందే ఓనాటి రాత్రి జరిగిన ఒక సంఘటన ఫలితంగా ఆమె వుద్యోగానికిరాజీనామా యిచ్చేసి వెళ్ళిపోయిందిలే! ఇవన్నీ నన్ను మరీ నిరుత్సాహపర్చాయి. వుద్యోగ ప్రయత్నం చేశాను. కాని, ఆ విషయం మా నాన్నకి తెలిసి పోయింది. రెచ్చిపోయారు.... ఆయన్ని యెదిరించడం నాకు సాధ్యం కాక పోయింది. అందరికి అంత ధైర్యమెలా ప్రబలగ్గలదు? నా ఆశయాన్ని ఆచరణలో పెట్టాలంటే, యిన్ని అవరోధాలు వచ్చాయి పద్మా. చివరికి ఓడిపోయాను నేను. ఏతావాతా నిజంగా మనం స్వతంత్రంగా జీవించదలుచుకుంటే కొంచెం కష్టమేననుకుంటాను. ఏదో క్షణికావేశాల కొద్దీ అలా అనేస్తుంటాంలే! వృద్ధిలోకి తీసుకురావడమే మనం సాధించాల్సిందని, ఇప్పుడిప్పుడర్థమవుతోంది. సరినా, నీ భావాలకి, నా భావాలు ఎప్పుడు ఎదిరిస్తాయనుకుంటాను. ఈ విషయం మావాళ్ళు విన్నారంటే, మనల్ని మరి లోకువగా చూస్తారు.... నేనలా అన్నానని యెవరితో అనకేం.. నవ్వుతూ అంది పార్వతి.

పద్మ చిన్నగా నవ్వింది.

"పోనీలే! ఎలాగైతేనేం — మళ్ళీ ఇద్దరూ ఆవేశాలు పెంచుకోకుండా కలిశారు. అదేచాలు. సరేగాని, మా యింటికి యెప్పుడొస్తారు?" అంది పద్మ.

"మీ ఆయన రానిస్తాడా?" నవ్వుతూ అంది పార్వతి. పద్మకూడా నవ్వేసింది.

"కూర్చో పద్మా వస్తాను...", అంటూ వంట గదిలోకి పోయింది. పార్వతి.

కాస్సేపటిలో కాఫీ తయారు చేసి తీసుకొచ్చి పద్మ కిచ్చింది. మరో రెండు కప్పులు తీసుకు పోయి భర్తకి, రాధాకృష్ణకి యిచ్చింది.

"ఏవండీ వదినగారూ: నామీద కోపం తగ్గిం దనుకుంటాను" అన్నాడు రాధాకృష్ణ.

పార్వతి సిగ్గుతో కుంచించుకు పోయింది. జవాబు చెప్పకుండా నవ్వు తెచ్చిపెట్టుకుని లోపలికి పోయింది.

తరువాత పద్మ, రాధా కృష్ణ, వెళ్లిపోయారు

"మనం రేపు వాళ్లింటికి వెళ్దామండీ:" అంది పార్వతి.

"ఏం? మళ్లీ సంగ్రామ సన్నాహమా యేమిటి?" చలోక్తి విసిరాడు రాజారావు.

"అబ్బ! పోదురూ" అనేసి లోపలికిపోయింది. రాజారావు నవ్వుకున్నాడు.

నాలుగురోజులు గడిచాయి. ముకుందం దగ్గర్నుంచి వుత్తరం వచ్చింది. రాజారావు చదువుకుని వంట గదివేపు వెళ్ళాడు.

"మీ నాన్న దగ్గర్నుంచి వుత్తరం వచ్చింది." అన్నాడు.

"ఏం రాశారండీ?" అంది ఆతృతగా.

"అందరూ క్షేమంగా వున్నారట...."

"అంతేనా" నిరుత్సాహంగా అంది.

"మరో విషయం కూడా రాశారు...."

"ఏమిటండీ" ఆత్రంగా అడిగింది.

"ఏదో ఉద్యోగం ఖాళీగా వుందట.... నిన్ను రమ్మన్నారు...." నవ్వుతూ అన్నాడు.

పార్వతి మొహం సిగ్గుతో యెర్రబారింది. "చాల్లెండి మీ దెప్పి పొడుపు: ఆవేశంలో యేదో అనేశాను. అప్పుడాన్ని సమర్థించుకుందుకు అవక తవక పనులు చేశాను. నిజమే. కాని యిప్పు డర్థమవుతుంది యదార్థం." అంది చిన్న బుచ్చుకుంటూ.

"ఏమిటూ అర్థమయ్యింది?"

"ఏదో ఒహటి పోనిద్దురూ. వెళ్లి మీపని చూసుకోండి...." చిరుకోపంతో అంది

"రాణీగారికి అప్పుడే కోపం వచ్చినట్టుంది. ఇప్పుడు నాకూ అర్థమయ్యింది...." అన్నాడు రాజారావు.

"ఏమిటూ అర్థమయింది?" అప్రయత్నంగా అడిగేసింది పార్వతి.

"ఏదో ఒహటి పోనిద్దూ! నీపని నువ్వు చూసుకో." అన్నాడు ఆమె మాటల్ని ఆమెకే అప్పజెప్తూ.

పార్వతి కిలకిలా నవ్వింది. రాజారావు ఆ నవ్వుకి ముగ్ధుడై మందహాసం వెలయిస్తూ, పార్వతిని దగ్గరగా తీసుకుని హృదయానికి హత్తు కున్నాడు.

బాబు మారాం చేస్తూ, అక్కడి కొచ్చి తల్లిదండ్రుల వేపు వింతగా చూస్తుంటే, ఆ దంపతులు కడుపుబ్బ నవ్వటం ప్రారంభించారు. ఆనవ్వు గదిలో ప్రతిధ్వనిచ్చింది. బాబుకూడా. ముసి ముసి నవ్వులు వెదజల్లాడు. ★



తరగని దారి — గున్నేశ్వరరావు